క్లుప్తంగా

ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రార్థన



దొమ్మాట చర్చిలో ప్రార్థన చేస్తున్న భక్తులు

దౌల్తాబాద్(దుబ్బాక): మెదక్ ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని దుబ్బాక పాస్టర్ల సంఘం వర్కింగ్ అధ్యక్షుడు గడ్డమీది జీవన్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని తిగుల్ గ్రామ సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమురవెల్లి మండలం ఐనాపూర్‌కు చెందిన రమేష్ అమెజాన్‌లో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం గజ్వేల్ నుంచి మునిగడప వైపు వెళ్తుండగా తిగుల్ సమీపంలో కాల్వ పనులు చేస్తున్న కార్మికుడు బైక్‌పై ఎదురు రావడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో ఇద్దరికి గాయాలు కాగా వెంటనే 108లో గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. అలాగే తిగుల్ గణేశ్‌పల్లి మధ్య పాల ఆటో అదుపుతప్పి కింద పడడంతో డ్రైవర్ అక్బర్‌కు తీవ్రగాయాలు కాగా గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

హుస్నాబాద్: ఐఓసీ భవనంలోని ఆర్‌ఓ కార్యాలయంలో అధికారులతో శనివారం హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికల వ్యయ పరిశీలకుడు వెంకదేశ్ సమావేశం నిర్వహించారు. 2019లో నిర్వహించిన ఎన్నికల్లో రూట్ నంబర్ 6, 9, 14లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ రూట్లల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రతి విషయాన్ని క్షుణంగా సీసీటీవీలో రికార్డు చేసి ఆర్‌ఓ కార్యాలయానికి అనుసంధానం చేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని.. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌ఓ బెన్ షాలోమ్ మాట్లాడుతూ.. నామినేషన్ వేసే ప్రతి అభ్యర్థి పూర్తి వివరాలు తెలపాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేటరూరల్/ప్రశాంత్‌నగర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవాపూర్, పుల్లూరు, చింతమడక, నారాయణరావుపేట, లక్ష్మీదేవిపల్లి 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి, మెడికల్ కళాశాల, డీఎక్స్ఎన్ కంపనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అతంరాయం ఉంటుందని సిద్దిపేట డివిజనల్ ఇంజనీర్ మహేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఆదర్శంగా గ్రామాలు

గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు మద్దతుగా శనివారం మండల పరిధిలోని అక్కారంలో సర్పంచ్ బాల్‌చంద్రంతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు నేడు సీఎం కేసీఆర్ పాలనలో ఆదర్శంగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అమరావతి, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజ వరకూ కొంటాం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఎంపీడీఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండలపరిధిలోని ఎల్లాయపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మహిపాల్, మహిళలు పాల్గొన్నారు.

‘పల్లా’ తరఫున సతీమణి ప్రచారం



26వ వార్డులో ఇంటింటా పర్యటిస్తున్న నీలిమ, బీఆర్ఎస్ కేడర్



నేత కార్మికుడిని ఓటు అడుగుతున్న నీలిమ

- నీలిమకు అపూర్వ స్వాగతం
- కాలనీవాసులతో మమేకం
- కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థన

జనగామ: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం కోసం ఆయన సతీమణి నీలిమ శనివారం విస్తృత ప్రచారం చేపట్టారు. జనగామ పట్టణ పరిధి 26, 27, 22 వార్డుల్లో రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆమె ఇంటింటికీ తిరిగి ప్రతీ ఓటరును పలకరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. జనగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు రాజేశ్వర్‌రెడ్డికి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మహిళలు నీలిమకు బొట్టుపెట్టి ఆశీర్వదించారు. ఆయా వార్డుల్లో వృద్ధులను ఆత్మీయంగా పలుకరిస్తూ, యువతకు దిశానిర్దేశం చేస్తూ మనందరి భవిష్యత్ కోసం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలతో పాటు కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీ మనందరికీ దక్కాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా నీలిమ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ సీఎంగా అధికారం చేపట్టిన తర్వాత తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. రైతులకు 24 గంటల పాటు ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్టు ఇలా ఏ రాష్ట్రం అమలు చేయని కార్యక్రమాలతో ప్రతి గడపకు సర్కారు స్కీంలు అందిస్తున్న ఘనత ఒక్క కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, వెన్నెం సత్యనిరంజన్‌రెడ్డి, కావ్య, ఉల్లెంగుల సందీప్ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా.. 13వ వార్డులో కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళరాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. శంకర్, పులిసాయి, పానుగంటి ప్రవీణ్, బబ్లూ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధి ఎనిమిది మండలాల్లో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది.

తరిగొప్పులలో ప్రచారం..

తరిగొప్పుల: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అబ్దుల్ నాగారం, సోలిపూర్, బొత్తలపర్రె గ్రామాల్లో ప్రచారం నిర్వహించి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జొన్నగోని సుదర్శన్‌గౌడ్, రాజేశ్వర్‌గౌడ్, దామెర ప్రభుదాస్, చిలువేరు లింగం, ఏడెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అమిరిశెట్టి వీరేందర్, సాయిల్ల రాజు, బూస యాదగిరి, మల్యాల సుధీర్, భూక్య రవి పాల్గొన్నారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న నీలిమ

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న జనగామ జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని జనగామ జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అన్నారు. శనివారం చేర్యాల మండలంలోని అర్జునపట్ల, మద్దూరు మండలంలోని వంగపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మేక సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల సమన్వయ కమిటీలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని అన్నారు. జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మల్లిపెద్ది సుమలత మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు వంగ భాస్కర్‌రెడ్డి, అర్జునపట్ల సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మేధావుల ఫోరం పేరిట కుట్రలు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్: మేధావుల సంఘాల పేరిట రాష్ట్ర రుణ విముక్తి కమిషన్ మాజీ సభ్యుడు కవ్వ లక్ష్మారెడ్డి, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి ఆదివారం హుస్నాబాద్‌లో పర్యటించడాన్ని బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. మేధావుల ఫోరం పేరిట బీఆర్ఎస్‌పై విషం కక్కుతున్నారని విమర్శించారు. పదవులు లేకపోవడంతో సమస్యలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చేందుకే సమావేశం పెడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఆరు గ్యారంటీలు



మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని సిద్దిపేట కాంగ్రెస్ అభ్యర్థి పూజల హరికృష్ణ అన్నారు. శనివారం సిద్దిపేటలో కాంగ్రెస్ పట్టణ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీకి తిరిగి పూర్వ వైభవం తెచ్చుకునే విధంగా అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు బాధ్యతగా ప్రచారం నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, నాయకులు సతీష్‌గౌడ్, కలీముద్దీన్, షాబుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముమ్మర ప్రచారం

దుబ్బాక/దుబ్బాకరూరల్/దౌల్తాబాద్/మిరుదొడ్డి: జిల్లాలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం జోరుగా సాగుతోంది. శనివారం వివిధ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటలో కౌన్సిలర్లు బాలకృష్ణగౌడ్, బత్తుల స్వామి, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని, గోవిందాపూర్, కోనాయిపల్లిలో మండల మండల పార్టీ అధ్యక్షుడు రణం శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహీమొద్దీన్, తదితరులు ప్రచారం నిర్వహించారు. మిరుదొడ్డి మండల పరిధిలోని లక్ష్మీనగర్, ఆరెపల్లి, ధర్మారంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, వైస్ ఎంపీపీ పోలీస్‌రాజులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఎండీ అహ్మద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ప్రచారం నిర్వహించారు.

కేసీఆర్‌ను లక్ష మెజార్టీతో గెలిపిద్దాం

వర్గల్(గజ్వేల్)/జగదేవ్‌పూర్: సీఎం కేసీఆర్‌ను లక్షపైగా మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని మీనాజీపేట, తున్కిమక్తలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్, ఎంపీపీ లతారమేష్‌గౌడ్, తదితరులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలోనే బీసీల అభివృద్ధి జరిగిందని నాచారం దేవాలయం మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లో ఆయన మాట్లాడారు.

అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ ఇతర పార్టీలకు చెందిన వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కారం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, యూత్‌కాంగ్రెస్ నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌చంద్రం, ఎంపీటీసీ ఆంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎగిరేది కాషాయం జెండానే



బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): మానకొండూర్‌లో బీజేపీ విజయం ఖాయమని ఆపార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగడి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బెజ్జంకిలో శనివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం బూత్‌స్థాయి సమావేశం నిర్వహించారు. బెజ్జంకి మండలంలో మొదటి నుంచి బీజేపీకి మంచి ఆదరణ ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బెజ్జంకి మండలాన్ని కరీంనగర్‌లో చేర్చేలా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి నాగేశ్వర్‌రావు, మాడ వెంకట్‌రెడ్డి, జగన్‌రెడ్డి, చాడ వెంకట్‌రెడ్డి, కొలిపాక రాజు, బుర్ర మల్లేశం, అనిల్‌రావు, మహేందర్, జ్యోతి, సత్యనారాయణ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సుభిక్షం



ప్రచారం చేస్తున్న చెరుకు విజయమ్మ

తొగుట(దుబ్బాక): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని దివంగత మాజీ మంత్రి చెరుకు విజయమ్మ అన్నారు. మండలంలోని తుక్కాపూర్‌లో దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటి దొమ్మాట, నేటి దుబ్బాక నియోజకవర్గాలను అభివృద్ధి చేసిన ఘనత ముత్యంరెడ్డికే దక్కిందన్నారు. మల్లన్నసాగర్‌లో భూములు కోల్పోయిన తుక్కాపూర్ రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల కృష్ణ, నాయకులు స్వామి, వెంకట్, గోపాల్ పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 26 రోజులు కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోసం కష్టపడి చేయాలని జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని మార్మాముల, ధర్మారం, సలాఖపూర్‌లో ఎన్నికల ప్రచార కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిఖిత జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవరెడ్డి తెలిపారు. 7వ తరగతికి చెందిన నిఖిత ఈనెల 23వ తేదీ నుంచి 27 వరకు త్రిపురలో జరిగే జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. విద్యార్థిని నిఖిత, పీఈటీ రజినిని ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

పోలీస్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్

దుబ్బాకరూరల్: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీస్‌లు, కేంద్ర బలగాలు మండలంలోని రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి, ఆకారం, లచ్చపేట, రామక్కపేట గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ కృష్ణ, ఎస్ఐ గంగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానంలో నిలిచినప్పుడే గుర్తింపు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలిచినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. పట్టణంలోని జీఎంఆర్ జూనియర్ కళాశాలలో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా తూప్రాన్ రోడ్డు మార్గంలోని ఏపీజీవీబీ గజ్వేల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎం ఆపరేషన్స్ కత్తి శ్రీనివాస్, ఎస్ఎం బిజినెస్ ఆఫీసర్ రజక్‌పాషా, బ్రాంచ్ మేనేజర్ మోహన్‌రాజు, ప్రిన్సిపాల్ రామచంద్రారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వృథాగా పోతున్న నీరు

‘మిషన్’ లీకేజీ

మద్దూరు(హుస్నాబాద్): మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. శనివారం దూల్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామ శివారులోని వంతెన వద్ద భగీరథ పైపులైన్ లీక్ కావడంతో నీరు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. మండలంలో నిత్యం పైపులైన్ లీకేజీలు అవుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్ఎస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): మండల కేంద్రంతో పాటు మండలంలోని కల్లెపెల్లి, పెరుకబండ గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు శనివారం బెజ్జంకి బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, ఏఎంసీ చైర్మన్ చంద్రకళ, ఎంపీటీసీ శారద, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

◆ ‘విశ్వరూప మహాసభకు తరలిరండి’

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 11వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని రామునిపట్ల, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, మాణిక్యం, రవీందర్, దేవరత్నం, దేవదాసు, రాజు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి(దుబ్బాక): సహకార బ్యాంకు రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి కోరారు. శనివారం మండలపరిధిలోని పలువురు డెయిరీ ఫాం లబ్ధిదారులకు డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ మహేందర్‌రెడ్డితో కలిసి ఒక్కొక్కరికి రూ. 3.79 లక్షల చెక్కులను అందించారు.

◆ నేడు కోదండరాం రాక

హుస్నాబాద్: పట్టణంలోని వైశ్యభవన్‌లో ఆదివారం నిర్వహించే ప్రెస్‌మీట్‌కు ప్రొఫెసర్ కోదండరాం రానున్నారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా జీవన ప్రమాణాలు, విద్య, వైద్యం, నీళ్లు, నిధులు, నియామకాలు, ప్రాజెక్టులు తదితర అనేక అంశాలపై ప్రజెంటేషన్ ఉంటుందని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు.

◆ ఓటు హక్కుపై అవగాహన

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లింగుపల్లిలో ఓటు హక్కుపై రెవెన్యూ అధికారులు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు రాజ్‌కుమార్, కొండల్‌రెడ్డి, వీఓఏ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

◆ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఆదివారం తలపెట్టిన మాదిగల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, దుబ్బాక ఇన్‌చార్జి సిద్దిని రాజమల్లయ్య మాదిగ పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో మాదిగల యుద్ధబేరి సభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు.

◆ సిద్దిపేట బరిలో ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థి

సిద్దిపేటకమాన్: విద్యార్థి, నిరుద్యోగ, ప్రజాసంఘాల ఉమ్మడి అభ్యర్థిని సిద్దిపేట నుంచి ఎన్నికల్లో పోటీలో నిలపనున్నట్లు విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ.. గడిచిన తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలు, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. సమావేశంలో విద్యార్థి, ప్రజాసంఘాల నాయకులు వెంకట్, ప్రణయ్, మహేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

◆ ‘కాసాని’ని కలిసిన ముదిరాజ్ నాయకులు

గజ్వేల్‌రూరల్: మాజీ రాజ్యసభ సభ్యుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను హైదరాబాద్‌లో శనివారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ లీగల్ సెల్ రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌తోనే ముదిరాజ్‌ల అభ్యున్నతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకితో పాటు మండలంలోని దాచారం, గుండారం గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, వార్డు సభ్యులు శనివారం కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు కవ్వంపెల్లి సత్యనారాయణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

◆ బీజేపీ కార్యకర్తలు పార్టీని వీడొద్దు



హుస్నాబాద్: అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని బీజేపీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని, కార్యకర్తలు పార్టీని వీడొద్దని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి కోరారు. నియోజకవర్గంలోని పార్టీ మండల అధ్యక్షులతో కలిసి శనివారం మాట్లాడారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.